Cell: 9440352036 మా ప్రతి అక్షరం - ప్రజల కోసం

# చిత్తూరు ఎక్స్‌ప్రెస్

జాతీయ తెలుగు దినపత్రిక

APTEL/2024/86143

Associate Editor: K L KRISHNAM RAJU | Volume: 6 | Issue : 79 | Saturday 22.02.2025 | Price : Rs.3/- | Pages : 4

అసోసియేట్ ఎడిటర్ కే ఎల్ కృష్ణంరాజు | సంపుటి: 6 | సంచిక : 79 | శనివారం 22. 02. 2025 | వెల : రూ.3/- | పేజీలు 4




ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు...

## మీకు లేదు

: ఢిల్లీ సీఎం రేఖా గుప్తా

ఒకరోజు కూడా గడవకముందే ప్రభుత్వంపై విమర్శలేమిటని ప్రశ్న

తొలి కెబినెట్ సమావేశంలో ఆయుష్మాన్ భారత్‌ను అందుబాటులోకి తెచ్చాం : ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : మా ప్రభుత్వం ఏర్పడి ఒక్కరోజు కూడా గడవలేదని, కానీ అప్పుడే విమర్శలు చేస్తున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా మండిపడ్డారు. కాంగ్రెస్ 15 ఏళ్లు, ఆమ్ ఆద్మీ పార్టీ 13 ఏళ్లు ఢిల్లీని పాలించాయని, ఇన్నేళ్లు ఏం చేశారో చూసుకోవాలని హితవు పలికారు. కానీ తాము పీఠం ఎక్కి ఒకరోజు కూడా కాలేదు, తమపై విమర్శలు చేయడమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన మొదటి

మిగతా 2 లో

ఏపీ వాణిజ్య స్ఫూర్తిని...

# ప్రతిబింబిస్తోంది

అతడి కథ ఒక స్ఫూర్తిదాయక జీవిత పాఠం : సీఎం - శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ వలసవెళ్లిన వ్యక్తి

వెదురుబుట్టలు, విసనకర్రలు తయారు చేసి అమ్ముతూ ఉపాధి- హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ పోస్టును షేర్ చేసిన చంద్రబాబు

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియాలో ఆసక్తికర పోస్టును పంచుకున్నారు. ఓ వ్యక్తి శ్రీకాకుళం జిల్లా నుంచి ఎన్నో ఏళ్ల కిందట హైదరాబాద్ కు వలసవెళ్లి అక్కడే వెదురు బుట్టలు, విసనకర్రలు, కొబ్బరి ఆకులతో పలు ఉత్పత్తులు తయారు చేస్తూ జీవిస్తున్న వైనాన్ని హ్యూమన్స్ ఆఫ్ హైదరాబాద్ అనే సోషల్ మీడియా హ్యాండిల్ పోస్టు చేసింది. ఈ పోస్టును షేర్ చేసిన ఏపీ సీఎం చంద్రబాబు... ఇది ఒక స్ఫూర్తిదాయక జీవితపాఠం అని కొనియాడారు. అతడి కథను పరిశీలిస్తే కష్టించి పనిచేసే స్వభావం, ఏపీ వాణిజ్య స్ఫూర్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. కానీ, అతడు సొంతగడ్డను వదిలి అవకాశాలను వెతుక్కుంటూ వేరే ప్రాంతానికి వెళ్లడం తనను విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఏదేమైనా ఆ వ్యక్తి పనితనం, ఆశావహ

మిగతా 2 లో



శివరాజ్ సింగ్‌కు...

## రైతుల కష్టాలు తెలుసు

: రామ్మోహన్ నాయుడు

చంద్రబాబు ఇప్పటికే మిర్చి రైతుల సమస్యలను కేంద్రానికి వివరించారు : రామ్మోహన్ నాయుడు

నేడు ఢిల్లీలో కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్ సింగ్ తో రామ్మోహన్ సమావేశం

ఈ సమావేశంలో పాల్గొన్న ఏపీ వ్యవసాయమంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు




న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మిర్చి రైతుల అంశంపై శుక్రవారం కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కలిశారు. ఈ సమావేశంలో కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. శివరాజ్ సింగ్ తో సమావేశం అనంతరం రామ్మోహన్ నాయుడు మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు పాల్గొన్నారని తెలిపారు. ఏపీ మిర్చి రైతుల సమస్యలపై కేంద్రమంత్రితో సుదీర్ఘంగా చర్చించామని

మిగతా 2 లో

ఐ మిస్ యూ...

## గౌతమ్: జగన్



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : మాజీ మంత్రి, దివంగత నేత మేకపాటి గౌతమ్ రెడ్డి మూడో వర్ధంతి నేడు. ఈ సందర్భంగా వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా భావోద్వేగంగా స్పందించారు. “నా ప్రియ మిత్రుడు మేకపాటి గౌతమ్ రెడ్డిని మూడో వర్ధంతి సందర్భంగా ప్రేమగా గుర్తు చేసుకుంటున్నా. ఐ మిస్ యూ గౌతమ్” అని ట్వీట్ చేశారు. గౌతమ్ రెడ్డితో కలిసి ఓ కార్యక్రమంలో ఉన్న ఫొటోను షేర్ చేశారు. ఏపీ ఐటీ, వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా ఉన్న గౌతమ్ రెడ్డి 2022 ఫిబ్రవరి 21న హైదరాబాదులోని తన నివాసంలో గుండెపోటుతో కుప్పకూలారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా శ్రమించినప్పటికీ ఫలితం లేకపోయింది. 49 ఏళ్ల చిన్న వయసులోనే గౌతమ్ మృతి చెందడం అందరినీ కలచి వేసింది.

ఏపీపీఎస్సీ మొండిగా వ్యవహరించాల్సిన అవసరం...

## ఏమొచ్చింది

గ్రూప్-2 అభ్యర్థుల పరిస్థితిని పట్టించుకోరా?: షర్మిల

గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనలపై షర్మిల స్పందన

రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దాలంటూ అభ్యర్థుల డిమాండ్

అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థుల ఆందోళనలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. గ్రూప్-2 అభ్యర్థులతో చంద్రబాబు ప్రభుత్వం చర్చించాలని డిమాండ్ చేశారు. 2023 డిసెంబరు 11వ తేదీన ఇచ్చిన నోటిఫికేషన్ రోస్టర్ విధానంలో తప్పులు ఉన్నాయని గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు తీవ్ర ఆందోళన లో ఉన్నారని తెలిపారు. తప్పులను సరిదిద్దకుంటే నష్టం

మిగతా 2 లో



కేసీఆర్ అలా చేయకపోయి ఉంటే చంద్రబాబుతో...

## పంచాయితీ ఉండకపోయేది

జగన్‌కు కేసీఆర్ పంచభక్ష పరమాన్నం పెట్టారని రేవంత్ రెడ్డి విమర్శ

తెలంగాణ జల దోపిడీకి అక్కడే అంకురార్పణ జరిగిందన్న ముఖ్యమంత్రి

కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే పంచాయితీ ఉండకపోయేదన్న రేవంత్ రెడ్డి

హైదరాబాద్, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : కేసీఆర్ అధికారంలో ఉన్న సమయ ంలో పాలమూరు ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు చంద్రబాబు తో పంచాయితీ ఉండకపోయేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో జగన్‌ను అధికార లాంఛనాలతో ఆహ్వానించి, పంచభక్ష పరమాన్నం పెట్టారని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల ద్వారా తెలంగాణ జల దోపిడీకి అక్కడే అంకురార్పణ జరిగిందని ఆరోపించారు. “ఈ పాపం మీది కాదా కేసీఆర్” అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి చెప్పులు మోసింది, ఊడిగం చేసింది కేసీఆర్ కాదా అన్నారు. నారాయణపేట జిల్లాలో ఇందిర

మిగతా 2 లో





విద్యావిధానంతో....

## రాజకీయం వద్దు

: కేంద్ర విద్యాశాఖ మంత్రి స్పష్టీకరణ

న్యూఢిల్లీ, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : కేంద్రం, తమిళనాడు ప్రభుత్వం మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం తమిళనాడుపై బలవంతంగా హిందీ భాషను రుద్దుతోందని ఆ రాష్ట్ర నేతలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ అంశంపై కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తాజాగా స్పందించారు. ఏ భాషనూ బలవంతంగా రుద్దడం లేదని

మిగతా 2 లో

ప్రజలు రోడ్డు మీద నిలబెట్టినా జగన్‌లో...

## మార్పు రాలేదు

జగన్ చేస్తున్న ఐప్యాక్ డ్రామాలను ప్రజలు ఛీ కొడుతున్నారు: కొల్లు రవీంద్ర

జగన్ ఏం మాట్లాడుతున్నారో ఎవరికీ అర్థం కావడం లేదని ఎద్దేవా

ఎన్నికల కోడ్ ఉన్నా మిర్చి యార్డుకు వెళ్లారని మండిపాటు



అమరావతి, **చిత్తూరు ఎక్స్‌ప్రెస్** : వైసీపీ అధినేత జగన్ పై మంత్రి కొల్లు రవీంద్ర మరోసారి విరుచుకుపడ్డారు. పోలీసులను బెదిరించే నీచ రాజకీయాలకు జగన్ తెరలేపారని మండిపడ్డారు. దళిత యువకుడిని కిడ్నాప్ చేస్తే పోలీసులు కేసు పెట్టరా? అని

మిగతా 2 లో

# సంపాదకీయం

## ట్రంప్‌పై నాటో దేశాలు తిరుగుబాటు.

అమెరికాలో ట్రంప్ రాకతో? ప్రపంచ రాజకీయాలు ఎప్పుడూ లేనంత ఆసక్తికరంగా మారాయి.ప్రపంచ పెద్దన్నగా అమెరికాలో ట్రంప్ రాక.. అంతర్జాతీయంగా అనూహ్యమైన మార్పులకు కారణం అయ్యింది. ప్రెసిడెంట్ ట్రంప్ టారిఫ్‌ల థ్రెట్ నుండీ.. నాటో సైనిక ఖర్చుల వరకూ యూరప్‌ను ముప్పు తిప్పలు పెట్టడానికి రెడీ అయ్యారు. అసలు ఎన్నికలు గెలవడానికి ముందు నుండే యూరప్‌ను బెదిరించడం మొదలు పెట్టారు ట్రంప్. నాటోకి కేటాయింపులు పెంచని యురోపియన్ దేశాలపై రష్యాను ఉసిగొల్పుతానంటూ వార్నింగ్ ఇచ్చారు. అక్కడ మొదలైన ఈ రెవల్రీ ఇప్పుడు మరింత రాజుకుంది.ఉక్రెయిన్‌పై రష్యా చేస్తున్న యుద్ధంలో.. మధ్యవర్తిత్వానికి రెడీ అయిన ట్రంప్.. ఒంటి పోకడతో.. యూరప్ పెత్తనం అవసరంలేదని చెప్పారు. అంతేనా.. అవసరమైతే అభిప్రాయాలు తెలియజేయండి కానీ.. తగుదునమ్మా అని నిర్ణయాలు తీసుకోవద్దూ అంటూ రుబాబు చేశారు ట్రంప్. యూరప్‌తో సంబంధిం లేకుండా సౌదీలో రష్యా అధికారులతో మంతనాలు మొదలుపెట్టారు. దీనితో? యురోపియన్ దేశాలు ఈగోపై బాంబ్ వేసినట్లయ్యింది. యూరప్ నాయకుల్లో ఆందోళన పెరిగింది.ఉక్రెయిన్ ఫ్యూచర్ గురించి రష్యాతో చేస్తున్న చర్చలకు అమెరికా తమను ఆహ్వానించకపోవడంతో యూరప్ దేశాలు తీవ్రమైన అసంతృప్తికి గురయ్యారు. దీనికి తోడు? యూరప్‌పై కక్ష్యగట్టిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను "అతి త్వరలో" కలవనున్నానని డొనాల్డ్ ట్రంప్ అనడం.. అదీ, తమ భద్రతా ఆందోళనలను అస్సలు పట్టించుకోకుండా ఏకపక్ష నిర్ణయం తీసుకోవడంపై యూరప్ నిప్పులు చేరుగుతోంది. అయితే, అమెరికాకు ఎదురెళ్లడానికి యూరప్ ఎలాంటి స్టెప్ తీసుకుంటుంది అనేది ఆసక్తిని రేపుతోంది. ఇప్పటికే, ఒత్తిడిలో ఉన్న యూరప్.. తమ రాజకీయ విభేదాలు, దేశీయ ఆర్థిక ఆందోళనలను పక్కనపెట్టి.. భద్రతా వ్యయాన్ని పెంచుతూ.. ఉక్రెయిన్ భవిష్యత్తుపై ఒకే తాటిపైకి ముందుకు వస్తాయా అన్నది చర్చనీయాంశమయ్యింది.ఉక్రెయిన్‌కు సాయంగా దళాలను పంపడం సాధ్యమేనా అనే సందేహాలు వస్తున్నాయి. ఉక్రెయిన్ వ్యవహారంలో మొదలైన చర్చల టేబుల్‌పై తమను తాము బలవంతంగా ఉంచుకోవడానికి యురోపియన్ యూనియన్ దేశాలు ప్రయత్నిస్తున్నాయా అనిపిస్తోంది. ఇక, డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మరో కరెన్సీని తీసుకురాడానికి ప్రయత్నిస్తేనే.. బ్రిక్స్ దేశాలపై గుర్రుమన్న డొనాల్డ్ ట్రంప్.. అలాంటిది, యూరప్.. అమెరికాకు ఎదురెళితే.. ట్రంప్ ఏం చేస్తారో అనే చర్చ జరుగుతుంది. ఈ నేపథ్యంలో.. వచ్చే నాలుగేళ్లూ.. యూరప్ వర్సెస్ ట్రంప్‌లా ప్రపంచ రాజకీయాలు మారాతాయా అనే డౌట్ వస్తోంది.ఇప్పటి వరకూ అమెరికాను అడ్డం పెట్టుకొని రష్యా దగ్గర కాలర్ ఎగరేస్తున్న యూరప్ దేశాలకు ఈ సందర్భం మరింత క్లిష్టంగా మారింది. అమెరికా అధ్యక్షుణ్ని యూరప్‌కు భాగస్వామి అని ఒప్పించడం అత్యవసరంగా మారింది. దానికి ఒక చిన్న అవకాశం కోసం వేచి చూస్తున్న యూరప్‌కు ట్రంప్ తీరు అడ్డంగా మారింది. అందుకే, పారిస్ సమావేశం ద్వారా ట్రంప్‌ను ఎలా తమ వైపుకు తిప్పుకోవాలా అనే ప్లాన్ చేస్తోంది యూరప్. ఇక, డొనాల్డ్ ట్రంప్ డిమాండ్ చేసిన రెండు ప్రధాన అంశాలపై యూరప్ ఉక్కిరిబిక్కిరి అవుతోంది.ఉక్రెయిన్ పోరాటంతో సంబంధం లేకుండానే నాటో కూటమి దేశాలు జిడిపిలో రెండు శాతం మొత్తాలను నాటో కోసం ఖర్చు చేయాలని ఎప్పటి నుంచో యూరప్ పైన అమెరికా ఒత్తిడి తెస్తోంది. యూరప్ రక్షణకు అమెరికా ఎందుకు మూల్యం చెల్లించాలని మొదటిసారి అధికారంలో ఉన్నపుడే ట్రంప్ ప్రశ్నించారు. అయితే, రెండోసారి గద్దెనెక్కిన తర్వాత.. ఇప్పుడు కనీసం 5 శాతం నాటోపై కూటమి దేశాలు ఖర్చుచేయాలని అంటున్నారు. అయితే, ఇప్పటి వరకూ నాటో దేశాల రక్షణ ఖర్చును అమెరికా దాదాపు 3.5 శాతం పెడుతుంటే.. రష్యాతో సరిహద్దును పంచుకునే పోలండ్, బాల్టిక్ దేశాలు కూడా తమ సైనిక బలగాలపై రెండు శాతాన్ని మించి ఖర్చు చేస్తున్నాయి.నాటోలో ప్రస్తుతం 32 సభ్యదేశాలు ఉన్నాయి. 1991లో సోవియట్ యూనియన్ పతనానంతరం తూర్పు యూరప్‌లోని అనేక దేశాలు నాటో కూటమిలో చేరాయి. అల్బేనియా, బల్గేరియా, హంగరీ, పోలండ్, చెక్ రిపబ్లిక్, స్లోవేకియా, రొమేనియా, లిథువేనియా, లాత్వియా, ఈస్టోనియా దేశాలు నాటో పంచన చేరాయి. ఇక, ఉక్రెయిన్ మీద రష్యా దండయాత్ర తర్వాత 2022లో స్వీడన్, ఫిన్లాండ్ నాటో సభ్యత్వం కోసం దరఖాస్తు చేసుకున్నాయి. దశాబ్దల తరబడి ఈ రెండు దేశాలు తటస్థంగా ఉన్నాయి. ఇక, రష్యాతో 13 వందల 40 కిలోమీటర్ల పొడవున సరిహద్దు కలిగిన ఫిన్లాండ్ 2023లో నాటోలో చేరింది.ఇక, 2024లో స్వీడన్ కూడా చేరింది. అయితే, స్వీడన్ చేరికను మొదట టర్కీ, హంగరీ వ్యతిరేకించినా చివరకు అంగీకరించాయి. స్వీడన్, ఫిన్లాండ్ చేరడం వల్ల 1990 తర్వాత నాటో భారీ విస్తరించినట్లయ్యింది. ఈ రెండు దేశాల నుంచి మిత్రరాజ్యాల సైన్యానికి మూడు లక్షల మంది సైన్యం జత కలిసినట్టయింది. ఇక, ఉక్రెయిన్, బోస్నియా, హెర్జ్‌గోవ్నియా, జార్జియా కూడా త్వరలో నాటోలో చేరడానికి ఆరాటపడుతున్నాయి.ట్రంప్ ప్రెసిడెంట్‌గా రెండోసారి పదవి చేపట్టిన తర్వాత.. పలు వివాదస్పద వ్యాఖ్యలతో ప్రపంచమంతా తనవైపు చూసేలా చేసుకున్నారు. ముందు, పనామా, మెక్సికో, కెనడాలను యునైటెడ్ స్టేట్స్‌లో చేర్చుకుంటామని చెప్పారు. అంత్య కీలక వ్యూహాత్మక ప్రాంతమైన గ్రీన్ లాండ్‌ను ఆక్రమించుకుంటానని కూడా అన్నారు. అయితే, ప్రస్తుతం ఐరోపా దేశమైన డెన్మార్క్ ఆధీనంలో ఉన్న గ్రీన్ లాండ్‌ను స్వాధీనం చేసుకోవడం అంత సులువైన పని కాదు. ఇప్పుడు.. యూరోపియన్ యూనియన్‌లో భాగమైన డెన్మార్క్, నాటో కూటమిలో సభ్యదేశంగా ఉన్న కెనడాలకు ట్రంప్ అంటే కాలిపోతోంది.

కాబట్టి యూరప్‌కు సొంత సైన్యం అవసరమని చాలా మంది అభిప్రాయపడుతున్నారనీ.. ఇప్పుడు ఆ టైం వచ్చిందని జెలెన్స్కీ అన్నారు. యూరప్, అమెరికా మధ్య ఉన్న చిరకాల బంధం ముగింపు దశకు చేరుకుందని, ఈ విషయాన్ని యూరప్ దేశాలు అర్థం చేసుకోవాలని ఇటీవల అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల్ని జెలన్స్కీ మ్యూనిచ్‌లో జరిగిన భద్రత సదస్సుల్లో గుర్తు చేశారు. ఇక, శిక్షణా విన్యాసాల సాకుతో రష్యా తన మిత్రదేశమైన బెలారస్‌కు సైన్యాన్ని పంపాలని యోచిస్తోందని.. ఇది నాటో దేశాలకు ప్రమాదమని హెచ్చరించారు.అయితే, ఉక్రెయిన్ నాటో కూటమిలో చేరడంలో విఫలమైతే దేశ సైనిక సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సి ఉంటుందన్నారు ప్రెసిడెంట్ జెలెన్స్కీ. అమెరికా సైనిక మద్దతు లేకుండా తమ దేశం రష్యాను ఎదుర్కోలేదని ఒప్పుకున్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో తమకు ట్రంప్, సైనిక సహాయాన్ని ఆపివేసినా ఆశ్చర్యపోనక్కర్లేదని అన్నారు. కాగా, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్, జెలెన్ స్కీలతో ఫోన్‌లో మాట్లాడారు., ఉక్రెయిన్ విషయంలో రష్యాతో శాంతి చర్చలకు సిద్ధపడిన ట్రంప్.. యూరప్‌ను రెచ్చగొట్టే విధంగా ఒక పనిచేశారు. శాంతి పరిష్కారంలో భాగంగా ఏ దేశాలు ఉక్రెయిన్‌కు దళాలను మోహరించడానికి సిద్ధంగా ఉంటాయి..? రష్యాపై ఆంక్షలను పెంచడానికి ఏ ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటాయి..? వాటిలో ఇప్పటికే ఉన్న వాటిని మరింత కఠినంగా అమలు చేయడం వంటి ఆరు అంశాలపై ప్రశ్నలతో కూడిన ఒక పత్రాన్ని అమెరికా యూరోపియన్ మిత్రదేశాలకు పంపింది. అయితే, నాటోలో అమెరికా రాయబారిగా ఉన్న జూలియాన్ స్మిత్ దీనిపై స్పందిస్తూ.. ఇలాంటి సంక్లిష్టమైన దౌత్య పనికి సాధారణంగా వారాల తరబడి సమావేశాలు జరుగుతాయనీ.. ఇలా ప్రశ్నాపత్రాలు నింపినంత మాత్రాన పరిస్థితిని చక్కదిద్దడం సాధ్యం కాదని అన్నారు.

## కేసీఆర్ అలా చేయకపోయి ఉంటే ...

ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన కేసీఆర్ వేల కోట్ల రూపాయలు మింగారని ఆరోపించారు. లక్ష కోట్ల రూపాయలు పెట్టి ప్రాజెక్టు కడితే అది కూలిపోయిందని మండిపడ్డారు. లగచర్లలో గొడవ పెట్టాలని చూశారని, కలెక్టర్‌ను చంపాలని చూశారని సంచలన ఆరోపణలు చేశారు. మా పాలమూరు ప్రాంతానికి పరిశ్రమలు రావొద్దా? ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. గట్టిగా కొడతానని కేసీఆర్ ఇటీవల అంటున్నారని, కొట్టడానికి అదేమైనా ఫుల్లా? హాఫా? అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కొట్టాల్సింది తనను కాదని, తప్పు చేస్తున్న ఆయన కొడుకు, అల్లుడిని కొట్టాలని వ్యాఖ్యానించారు. గట్టిగా కొడితే తమ పార్టీ కార్యకర్తలు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల కాలంలో పాలమూరు ప్రాజెక్టులను ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలని నిలదీశారు. కేసీఆర్‌కు ఎంపీ పదవి పాలమూరు ప్రజల బిక్షే అన్నారు.

**ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో దోపిడీకి పాల్పడ్డారు**

ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో దోపిడీకి పాల్పడ్డారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన చోటే ఓట్లు అడగాలని బీఆర్ఎస్ నేతలు అంటున్నారని, అందుకు తాము సిద్ధమని ఆయన చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న చోట కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని, డబుల్ బెడ్రూంలు ఉన్న చోట బీఆర్ఎస్ అడగడానికి సిద్ధమా? అని సవాల్ చేశారు. పాలమూరు పేదరికాన్ని చూపించి కేసీఆర్ మార్కెటింగ్ చేసుకున్నారని ఆరోపించారు. తనపై కోపంతో కేసీఆర్ పాలమూరుపై కక్ష కట్టారని విమర్శించారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్టులపై తాను దృష్టి సారించానని అన్నారు. ఆంధ్రప్రదేశ్ కృష్ణా నీటిని తరలించుకుపోతుంటే కేసీఆర్ మౌనంగా ఉన్నారని విమర్శించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవలేదని, 2024 లోక్ సభ ఎన్నికల్లో ఎంపీ సీట్లు ఒక్కటి కూడా రాలేదని గుర్తు చేశారు. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆ పార్టీకి అభ్యర్థులు కూడా దొరకడం లేదు, అదో పార్టీయా అని ఎద్దేవా చేశారు.

**మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటే పంచాయితీ పెట్టాలని చూస్తున్నారు**

మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటే కొంతమంది పంచాయితీ పెట్టాలని చూస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. పాలమూరుకు ముఖ్యమంత్రి రూపంలో ఒక అవకాశం వచ్చిందని ఆయన అన్నారు. మన ఇంటి బిడ్డకు అవకాశమొస్తే కడుపులో కత్తులు పెట్టి చంపాలని చూస్తున్నారని విమర్శించారు. అలాంటి వారికి పాలమూరు యువత బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పనులు చేసే బాధ్యత తనదని, తనను కాపాడుకునే బాధ్యత మాత్రం పాలమూరు ప్రజలదే అన్నారు. మనకు మళ్లీ ఇలాంటి అవకాశం రాదని ఆయన అన్నారు. మనకు అవకాశం వచ్చినప్పుడే ప్రాజెక్టులు పూర్తి చేసుకుందామని అన్నారు. కొడంగల్‌లో ప్రాజెక్టులు తెచ్చి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించుకుందామని ఆయన అన్నారు.

**భూసేకరణను అడ్డుకోవద్దని విజ్ఞప్తి**

పాలమూరు ప్రజలు భూసేకరణను అడ్డుకోవద్దని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. భూములు కోల్పోయిన వారికి మంచి పరిహారం ఇస్తామని అన్నారు. ఇక్కడ మీ బిడ్డ, మీ సోదరుడు ఉన్నాడని, కాబట్టి పరిహారం తప్పకుండా ఇస్తామన్నారు. నష్టపరిహారం ఇచ్చి, ఉద్దండపూర్ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పాలమూరు ప్రజల కష్టాలను తీర్చకుంటే మీ బిడ్డ అధికారంలో ఉండి ఏం లాభమని వ్యాఖ్యానించారు.

## ఏపీ వాణిజ్య స్ఫూర్తిని...



దృక్పథం బాగా నచ్చాయని... తన కలలను, కళను కలగలిపి వస్తువులుగా మలిచి జీవనం సాగిస్తుండడాన్ని ప్రగాఢంగా అభిమానిస్తున్నానని వివరించారు. "ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని పునర్ నిర్మించడానికి, అవకాశాలను సృష్టించడానికి కృషి చేస్తోంది. ఆ వ్యక్తిలా నైపుణ్యం ఉన్న వారు స్వస్థలంలోనే ఉంటే ఎదిగేందుకు తోడ్పాటు అందిస్తాం" అని చంద్రబాబు ట్వీట్ చేశారు.

## పార్టీ ఇమేజకే కాషాయం ప్రాధాన్యం

న్యూఢిల్లీ , **చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :** దేశ రాజధాని న్యూఢిల్లీకి తదుపరి ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేశారు. న్యూఢిల్లీ సీఎంగా రేఖా గుప్తా పేరును బీజేపీ ప్రకటించింది. బుధవారం సాయంత్రం రాజధానిలో బీజేపీ లేజిస్లేటివ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పేరును బీజేపీ అగ్రనాయకత్వం ప్రకటించింది. రేఖ గుప్తాను ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయితే రేఖాగుప్తా తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ వెంటనే సీఎం సీటును జాక్ పాట్ గా కొట్టేశారు. ఆమె షాలిమార్ బాగ్ అసెంబ్లీ నియోజక వర్గ నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. దీంతో బీజేపీ 27ఏళ్ల కలను సాకారం చేసుకుంది.వాస్తవానికి బీజేపీలో సీఎంల ఎంపిక సాఫీగా కొనసాగుతుంది. ఎంత మంది సీనియర్లు సీఎం సీటు కోసం పోటీ పడినప్పటికీ వారందరినీ కూల్ చేసి.. ఆ పార్టీ పెద్దలైన మోదీ, అమిత్ షా ఎవరికి సీఎం పదవి అప్పగించాలని అనుకుంటారో వారికే అప్పగిస్తారు. ఈ క్రమంలోనే ఢిల్లీలో రేఖా గుప్తాకు ముఖ్యమంత్రిగా అవకాశం ఇచ్చారు. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న రాజధాని ఢిల్లీకి ఫస్ట్ టైం ఎమ్మెల్యేను సీఎంగా బీజేపీ ప్రకటించడంతో రాజకీయ వర్గాలు ఆసక్తిగా గమనించాయి. చాలా మంది సీనియర్ నేతలను కాదని ఈమెకు బీజేపీ అధిష్టానం ఇంత ప్రియారిటీ ఇచ్చిందో అని ఆలోచనలో పడ్డారు. ఎమ్మెల్యేగా కూడా రాజకీయ అనుభవం లేని మహిళను సీఎం స్థానంలో కూర్చోబెట్టడంలో బీజేపీ హైకమాండ్ ప్లాన్ ఏంటని అనుకుంటున్నారు. రేఖా గుప్తా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచి రాజకీయ వర్గాల్లో ఈ ప్రశ్నలు చక్కర్లు కొడుతున్నాయి. ఢిల్లీలో 48 స్థానాల్లో బీజేపీ గెలిచినప్పటి నుంచి ఢిల్లీ సీఎం వీళ్లు అవుతారంటూ చాలా మంది పేర్లు వినిపించాయి. కానీ బీజేపీ మొదటి నుంచే మహిళను సీఎం చేయాలని భావిస్తుంది. ఈ క్రమంలో బన్సూరీ స్వరాజ్, స్మృతీ ఇరానీ పేర్లు తెరమీదకు వచ్చాయి. కానీ అనూహ్యంగా రేఖా గుప్తా పేరును బీజేపీ హైకమాండ్ ప్రకటించింది. సీఎం పదవి కోసం చాలా మంది వారసులు పోటీ పడ్డారు. కేజ్రీవాల్ ను ఓడించిన పర్వేశ్ వర్మతో పాటు సుష్మస్వరాజ్ కూతురు కూడా లైన్లో ఉన్నారు. కానీ వారందరినీ కాదని రేఖా గుప్తాను అవకాశం ఇచ్చారు.అంతకు ముందు మహారాష్ట్ర, హర్యానా, మధ్యప్రదేశ్, రాజస్థాన్ లాంటి రాష్ట్రాల్లో కూడా ఊహించని పేర్లను ప్రకటించారు మోదీ, షా. మధ్యప్రదేశ్ సీఎంగా శివరాజ్ సింగ్ చౌహాన్ ను కాదని మోహన్ యాదవ్ ను సెలక్ట్ చేశారు. చౌహాన్ కు మధ్యప్రదేశ్ లో భారీ క్రేజ్ ఉంది. అయినా సరే ఆయనను కేంద్రానికే పరిమితం చేశారు. కొత్త నాయకత్వానికి అవకాశం అందించారు. రాజస్థాన్ లో వసుంధర రాజే వంటి వారు గట్టిగా ఒత్తిడి తెచ్చినప్పటికీ భజన్ లాల్ శర్మకు ఛాన్స్ ఇచ్చారు. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ కు అవకాశం ఇవ్వడానికి ఆయన సీఎంగా చేసి.. డిప్యూటీ సీఎంగా ఉండటానికి ఏ మాత్రం సంకోచించకపోవడమే కారణం. హర్యానాలో కూడా నాయబ్ సింగ్ సైనీకి అవకాశం కల్పించారు.మోదీ, అమిత్ షాల వెనుక ఈ సెలక్షన్ పద్ధతి పార్టీ బలోపేతం కావాలి కానీ నాయకులకు వ్యక్తిగత ఇమేజ్ పెరగకూడదన్న కారణం ఉందని అనుకోవచ్చు. బీజేపీ ప్రస్తుత ముఖ్యమంత్రులంతా కూడా ఓ రకంగా పాపులారిటీ లేని వారే. ఒక్క ఆదిత్యనాథ్ మాత్రమే ప్రస్తుతం కాస్త ఇమేజ్ ఉన్న ముఖ్యమంత్రి. పార్టీ కన్నా ఎక్కువగా ఏ నేత బీజేపీలో పాపులర్ కాకూడదన్నది బీజేపీ అగ్రనేతల వ్యూహం అని అంటున్నారు.

## భారత తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న...

# మౌలానా అబుల్ కలాం ఆజాద్

### -నేడు ఆయన వర్ధంతి

**చిత్తూరు ఎక్స్‌ప్రెస్ :**ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్. ఆయన అసలుపేరు 'మొహియుద్దీన్ అహ్మద్', 'అబుల్ కలాం' అనేది బిరుదు, 'ఆజాద్' కలంపేరు. ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్ లకు 1888 నవంబరు 11 న మక్కాలో జన్మించాడు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసాడు. ఆయన భారతదేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా పని చేశారు. నవంబర్ 11న ఆయన జన్మదినం సందర్భంగా మన దేశంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1947 ఆగస్టు 15 నుండి అంటే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి 1958 ఫిబ్రవరి 2 వరకు కేంద్ర విద్యా శాఖ మంత్రిగా సేవలు అందించారు. ఈయన సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం ఈయనకు భారతరత్న అవార్డు సైతం ఇచ్చింది. అంతేకాదు ఈయన పేరిట పలు విద్యాసంస్థలు కూడా నెలకొల్పబడ్డాయి. అబుల్ కలాం మంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం సహా భారతదేశం అంతటా వివిధ కళాశాలలు మరియు విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. ఈయన సేవలకు గుర్తుగా 2008లో భారత ప్రభుత్వం ఆయన పుట్టినరోజును జాతీయ విద్యా దినోత్సవంగా నిర్ణయించింది. మౌలానా అబుల్ కలాం ఆజాద్ మక్కానగరంలో 1888 నవంబరు 11 న జన్మించాడు. అతని వంశస్థులు బాబర్ రోజుల్లో హేరాత్ (ఆఫ్ఘనిస్తాన్లో ఒక నగరం) కు చెందిన వారు. ఆజాద్ ముస్లిం పండితులు, లేదా మౌలానాల వంశం నుండి వచ్చాడు. అతని తల్లి ఒక అరబ్, షేక్ మహ్మద్ జహీర్ వత్రి, అతని తండ్రి మౌలానా ఖైరుద్దీన్ ఆఫ్ఘన్ మూలాల ఉన్న ఒక బెంగాలీ ముస్లిం. ఖైరుద్దీన్ సిపాయి తిరుగుబాటు సమయంలో భారతదేశం నుండి మక్కా వెళ్లి అక్కడే స్థిరపడ్డారు.1890 లో అయన తన కుటుంబంతో కలకత్తా వెళ్లాడు. ఆజాద్ సంప్రదాయ ఇస్లామిక్ విద్య అభ్యసించాడు. అతని విద్య ఇంట్లోనే సాగింది. మొదట తండ్రి, పిదప ఉపాధ్యాయులు ఇంట్లోనే బోధించారు. ఆజాద్ మొదట అరబిక్, పెర్షియన్ నేర్చుకున్నాడు. తరువాత తత్వశాస్త్రం, రేఖాగణితం, గణితం, బీజగణితం అభ్యసించాడు. స్వీయ అధ్యయనం ద్వారా ఇంగ్లీష్, ప్రపంచ చరిత్ర, రాజకీయాలు నేర్చుకున్నాడు.ఆజాద్ మౌలానా అగుటకు కావలసిన మత శిక్షణ పొందాడు.అతను దివ్య ఖురాన్ పై భాష్యం వ్రాసాడు.. అతను జమాలుద్దీన్ ఆఫ్ఘానీ పాన్-ఇస్లామిక్ సిద్ధాంతాలలో, అలిగర్ సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఆలోచనలో ఆసక్తి చూపేవాడు. పాన్-ఇస్లామిక్ భావాలతో అతను ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్, ఈజిప్ట్, సిరియా, టర్కీ సందర్శించాడు.ఇరాక్ లో అతను ఇరాన్ రాజ్యాంగ ప్రభుత్వ స్థాపనకు పోరాటం సల్పుతున్న నిర్వాసిత విప్లవ కారులను కలుసుకున్నాడు. ఈజిప్ట్ లో అతను షేక్ ముహమ్మద్ అబ్దుహ్, సయీద్ పాషా వంటి అరబ్ ప్రపంచంలోని ఇతర విప్లవకారులను కలుసుకున్నారు. అతను కాన్స్టాంటినోపుల్లో యంగ్ టర్క్స్ భావాలతో పరిచయం పెంచుకున్నాడు. ఈ పరిచయాలు అన్ని అతనిని ఒక జాతీయవాద విప్లవవాదిగా రూపాంతరం చెందించాయి.విదేశాల నుంచి తిరిగొచ్చిన అనంతరం ఆజాద్, బెంగాల్ కు చెందిన అరవింద ఘోష్, శ్రీ శ్యాం సుందర్ చక్రవర్తి వంటి ప్రముఖ విప్లవకారులను కలుసుకున్నారు, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు ఉద్యమాన్ని చేపట్టారు. విప్లవాత్మక చర్యలు బెంగాల్, బీహార్ లకు పరిమితం అగుట ఆజాద్ కు తెలిసి రెండు సంవత్సరాల లోపల, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉత్తర భారతదేశం, బాంబే లాంటి ప్రాంతాలలో రహస్య విప్లవ కేంద్రాలు ఏర్పాటుచేసారు. ఆసమయంలో విప్లవ వాదులు ముస్లింల విప్లవ వ్యతిరేకులుగా భావించసాగారు ఎందుకంటే బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశ స్వాతంత్ర్య పోరాటానికి వ్యతిరేకంగా ముస్లిం కమ్యూనిటీని ఉపయోగిస్తుందని భావించాడు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ తన సహచరులను ముస్లింల పట్ల వారి పగను పోగొట్టటానికి ప్రయత్నించాడు.1912 లో మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఉర్దూలో ' అల్ హిలాల్' వార పత్రిక ముస్లింల మధ్య విప్లవాత్మక భావాలను పెంచడానికి ప్రారంభించారు. అల్ హిలాల్ మోర్లే-మింటో సంస్కరణల ఫలితంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన సంఘర్షణల తర్వాత హిందూ మతం-ముస్లిం వర్గాల మధ్య ఐక్యత కుదుర్చటంలో ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. 'అల్ హిలాల్' అతివాద భావనల ఒక విప్లవాత్మక ధ్వనిగా మారింది. ప్రభుత్వం వేర్పాటువాద భావనల ప్రచారకునిగా "అల్- హిలాల్"ను భావిస్తుంది. ప్రభుత్వం దానిని 1914 లో నిషేధించింది.ఆజాద్ భారతీయ జాతీయ వాదం, హిందూ -ముస్లిం ఐక్యత ఆధారంగా విప్లవాత్మక ఆలోచనలతో మరో పత్రికను "అల్ బలఘ్" ప్రారంభించారు.1916 లో ప్రభుత్వం ఈ పత్రికను కూడా నిషేధించారు, రాంచిలో ఆజాద్ ను నిర్బంధించారు. ఆతరువాత మొదటి ప్రపంచ యుద్ధం 1920 తర్వాత విడుదల చేసారు. విడుదల తరువాత ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం కమ్యూనిటీలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెంచారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ గాంధీజీ ప్రారంభించిన "సహాయ నిరాకరణ" ఉద్యమం ను సమర్థించి 1920 లో భారత జాతీయ కాంగ్రెస్ లో చేరాడు.ఇతడు ఢిల్లీ కాంగ్రెస్ ప్రత్యేక సెషన్ అధ్యక్షుడు గా (1923) ఎన్నికయ్యాడు.మౌలానా అబుల్ కలాం ఆజాద్ 1940 (రాంగడ్) లో కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికయ్యాడు , 1946 వరకు ఆ పదవిలో ఉన్నాడు.అతను విభజనకు వ్యతిరేకి. విభజన అతని కలలను నాశనం చేసింది. హిందువులు , ముస్లింలు కలసి సహజీవనం చేస్తున్న ఒక ఏకీకృత దేశం బద్దలు అగుట అతని కలను నాశనం చేసి అతనిని విపరీతంగా బాధించింది.మౌలానా ఆజాద్ గాంధీజీ ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 1930 లో అరెస్టు అయ్యాడు. అతనిని ఒక సంవత్సరంన్నర పాటు మీరట్ జైల్లో ఉంచారు. ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని 10 సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు.1958 ఫిబ్రవరి 22 న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ మరణించాడు.

## ప్రజలు రోడ్డు మీద నిలబెట్టినా జగన్‌లో...

ప్రశ్నించారు. ప్రజలు గుడ్డలు ఊడదీసి రోడ్డు మీద నిలబెట్టినా జగన్ లో మార్పు రాలేదని అన్నారు. ఆయన ఏం మాట్లాడుతున్నారో కూడా ఎవరికీ అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉందని అధికారులు చెప్పినా... రాజకీయ స్వార్థం కోసం గుంటూరు మిర్చి యార్డుకు జగన్ వెళ్లారని రవీంద్ర విమర్శించారు. పెయిడ్ ఆర్టిస్టులను రైతులుగా నిలబెట్టి ఐప్యాక్ డ్రామాలు చేశారని మండిపడ్డారు. జగన్ చేస్తున్న ఐప్యాక్ డ్రామాలను ప్రజలు ఛీ కొడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ... అధికారం లేకపోతే ప్రజాసేవ చేయలేరా? అని ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ప్రజలకు జవాబుదారీగానే ఉన్నామని చెప్పారు. జగన్, వైసీపీ నేతల అరాచకాలు, విధ్వంసం, అవినీతితో నాశనమైన కృష్ణా జిల్లా ఖ్యాతిని తిరిగి తీసుకొచ్చేందుకు తామంతా కష్టపడుతున్నామని అన్నారు.

## ఏపీపీఎస్సీ మొండిగా ...

జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. "న్యాయపరమైన ఇబ్బందులతో నోటిఫికేషన్ రద్దయ్యే పరిస్థితులు ఉంటాయని అంటున్నారు. రోస్టర్ విధానంలో తప్పుల తడకతో ఝూర?ండ్ తరహాలో నోటిఫికేషన్ రద్దయి ఉద్యోగాలు పోయిన పరిస్థితులు ఇక్కడ కూడా ఎదురవుతాయని అభ్యర్థులు భయపడుతున్నారు. తప్పులు సరిదిద్దాలని అభ్యర్థులు కోరుతున్నారు. మరోవైపు అడ్వొకేట్ జనరల్ సైతం తప్పులు ఉన్నాయని కోర్టులో ఒప్పుకుంటే... హడావిడిగా ఈ నెల 23న పరీక్ష నిర్వహించాల్సిన అవసరం ఏమొచ్చిందని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాం. ఏపీపీఎస్సీ మొండిగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏంటి? రాష్ట్రవ్యాప్తంగా రోడ్లపై గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు ఆందోళనలు చేస్తుంటే వారి విజ్ఞప్తిని పట్టించుకోరా? రోస్టర్ విధానంలో తప్పులు సరిదిద్దే అంశంపై మెయిన్స్ పరీక్ష నిర్వహణపై కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలి. ఆందోళనలో ఉన్న గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులను పిలిచి చర్చించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం చంద్రబాబును డిమాండ్ చేస్తున్నాం" అంటూ షర్మిల ట్వీట్ చేశారు. గ్రూప్-2 మెయిన్స్ అభ్యర్థులు ఆందోళన చేపడుతున్న వీడియోను కూడా పంచుకున్నారు.

## శివరాజ్ సింగ్‌కు...

వెల్లడించారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతులను ఆదుకునేందుకు యత్నిస్తున్నామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. మిర్చి ఉత్పత్తి ఖర్చును లెక్కిస్తే ఎకరాకు రూ.11,600 వచ్చిందని వెల్లడించారు. రైతులకు రూ.11,600 కంటే ఎక్కువే అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో మాదిరిగా ఇప్పుడు మిర్చి ఎగుమతులు జరగడంలేదని, మిర్చి ఎగుమతులు పెంచడంపైనా నేడు శివరాజ్ సింగ్ తో చర్చించామని తెలిపారు. మిర్చి ఎగుమతిదారులతో ఏపీలో సదస్సు నిర్వహించాలని నిర్ణయించామని అన్నారు. సలహాలు, సూచనల మేరకు మిర్చి ఎగుమతులు పెంచడంపై దృష్టి సారిస్తున్నట్టు వివరించారు. మిర్చి రైతుల ఆదాయం పెంచేందుకు ఆలోచిస్తున్నామని, ఇప్పటికే మిర్చి రైతుల సమస్యలను సీఎం చంద్రబాబు కేంద్రం దృష్టికి తెచ్చారని రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. "కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రైతుల కష్టం తెలుసు. నిన్న చంద్రబాబు వచ్చిన సమయంలో శివరాజ్ సింగ్ చౌహాన్ ఢిల్లీలో లేరు. అయినప్పటికీ ఆయన చంద్రబాబుతో మాట్లాడారు. ఇవాళ ఢిల్లీ వచ్చిన వెంటనే శివరాజ్ సింగ్ అధికారులతో మాట్లాడారు. మార్కెట్ ధర, పెట్టుబడి ఖర్చుల తేడాను భరించాలని నేటి సమావేశంలో ఆయనను కోరాం. ఉత్పత్తి ఖర్చును రూ.11,600కి పైగా ఉండేలా నిర్ణయించాలని ఐకార్ (ICAR)ను కోరాం" అని రామ్మోహన్ నాయుడు వివరించారు.

## ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు...

రోజే తాము కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆయుష్మాన్ భారత్ యోజనను అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. దీంతో ప్రజలకు రూ.10 లక్షల మేరకు వైద్య సహాయం అందుతుందని తెలిపారు. ప్రజలకు రూ.10 లక్షల విలువ చేసే వైద్య సహాయాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ అమలు చేయలేదని విమర్శించారు.పదమూడేళ్లు ఏమీ చేయని వారికి తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదన్నారు. నరేంద్ర మోదీ నేతృత్వంలో ఢిల్లీ తన హక్కులన్నింటినీ పొందుతుందని అన్నారు. ముందు మీరు మీ పార్టీ గురించి చూసుకోవాలని హితవు పలికారు. ఆమ్ ఆద్మీ పార్టీని ఎంతోమంది వీడాలనుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కాగ్ నివేదికను అసెంబ్లీలో పెడితే అన్ని విషయాలు తెలుస్తాయని ముఖ్యమంత్రి అన్నారు.ఢిల్లీలో మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించే పథకాన్ని మొదటి కేబినెట్ సమావేశంలో ఆమోదిస్తామని బీజేపీ హామీ ఇచ్చిందని, కానీ మొదటి రోజు దానిని ఉల్లంఘించిందని మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు అతిషి ఆరోపించారు. అతిషి విమర్శలకు ముఖ్యమంత్రి పైవిధంగా కౌంటర్ ఇచ్చారు.

## విద్యావిధానంతో....



స్పష్టం చేశారు. ఈ మేరకు తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్‌కే స్టాలిన్ కు కేంద్ర మంత్రి లేఖ రాశారు. విదేశీ భాషపై అధికంగా ఆధారపడుతున్న విషయాన్ని ఆయన లేఖలో ప్రస్తావించారు. ఫలితంగా విద్యార్థులకు తమ మూలాలపై అవగాహన తగ్గుతోందన్నారు. జాతీయ విద్యావిధానం ద్వారా ఈ పరిస్థితిని సరిచేసే ప్రయత్నం జరుగుతోందని వెల్లడించారు. తమకు నచ్చిన భాషను ఎంచుకునే స్వేచ్ఛకు జాతీయ విద్యావిధానం ఎప్పుడూ మద్దతు తెలుపుతూనే ఉందని గుర్తు చేశారు.తమిళ భాష శాశ్వతమని గతంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి లేఖలో గుర్తు చేశారు. రాజకీయ కారణాలతో జాతీయ విద్యావిధానాన్ని తమిళనాడులోని అధికార డీఎమ్‌కే పార్టీ వ్యతిరేకించడాన్ని ఆయన తప్పుబట్టారు. తమిళ సంస్కృతి, భాషకు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం కల్పించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. విద్యావిధానంతో రాజకీయం వద్దని విజ్ఞప్తి చేశారు.అంతకుముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తమిళనాడు సీఎం స్టాలిన్ లేఖ రాసిన విషయం తెలిసిందే. సమగ్రశిక్షా పథకం కింద రాష్ట్రానికి రూ.2,152 కోట్ల నిధులను వెంటనే మంజూరు చేయాలని ప్రధానిని కోరారు. అదేవిధంగా జాతీయ విద్యా విధానం-2020ని పూర్తిగా అమలు చేసి త్రిభాషా విధానాన్ని ఆమోదించే వరకు తమిళనాడుకు సమగ్ర శిక్షా పథకం కింద నిధులు మంజూరు చేయమబోమని కేంద్ర విద్యాశాఖ మంత్రి ఇటీవల వెల్లడించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి నుంచి ఈ స్పందన వచ్చింది.

### ఘనంగా ఆంజనేయ స్వామి పుష్ప పల్లకి.....

## పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అమర్



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: వీ.కోట మండల కేంద్రంలో శ్రీ ఆంజనేయ స్వామి పుష్ప పల్లకి సేవా శుక్రవారం ఘనంగా జరిగింది. ఏటా ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ కార్యక్రమానికి పలమనేరు శాసనసభ్యులు శ్రీ.యన్. అమరనాథ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా చేపట్టిన ఊరేగింపుతో పాటు ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో ఆయన పాల్గొన్నారు. పూజల అనంతరం కమిటీ సభ్యులు ఆయనను ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమాలలో ఆయనతోపాటు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్ర నాయుడు,టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, రాంబాబు, విశ్వనాథ్, ధీరజ్,శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ లక్ష్మీ నరసింహ స్వామికి .....

## మాఘ మాస శుక్రవారం అభిషేక పూజలు



కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 21: పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అర్చనలు, పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్య క్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి మంగళహారతి గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

### ఎమ్మెల్యే చేతుల మీదుగా...

## డైరీ ఆవిష్కరణ



పలమనేరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: పలమనేరు నియోజకవర్గ అసోసియేషన్ ఆఫ్ సెక్రటరియేట్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీలను పలమనేర్ శాసన సభ్యులు అమర్నాథరెడ్డి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు.స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ విద్యాసాగర్,అసోసియేషన్ ఆఫ్ సెక్రెటరియేట్ ఇంజనీర్స్ మెంబర్స్ బాలచంద్ర, సమీర్, కళ్యాణ్ కృష్ణ, కార్తీక్, భాగ్యరాజ్,వసీం,మురళి,శ్రీరాము,టిప్పు సుల్తాన్,ఆదాం,వినయ్ తదితరులున్నారు.

### మహిళలను మోసగించి.....

## బంగారు ఆభరణాలు చోరీ

పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: అన్నమయ్య జిల్లా పీలేరుపట్టణంలో మహిళకు మాయ మాటలు చెప్పి ఆమె దగ్గర ఉన్న బంగారునగలతో ఊడయించా డు.పీలేరు మండలం దొడ్డిపల్లి పంచాయతీ కొండ్రెడ్డి గారి పల్లికి చెందిన కంభం కృష్ణమ్మ వైద్యం కోసం శుక్రవారం పీలేరుకు వచ్చింది. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇద్దరు ఆగంతకులు ఆమెను మాటల్లోకి దింపారు. ఒంటిపై ఉన్న నగలు అన్ని ఊడదీసి చేతి లో పెట్టుకోమని సలహా ఇచ్చారు. వారి మాటలు విన్న ఈమె నగలన్నీ ఒంటిపై నుంచి విప్పుకొని చేతులు పట్టుకుంది. మేము కూడా అలాగే పట్టుకున్నామని వారి వద్దనున్న నగలు చూపించారు. ఈ క్రమంలో ఈమె చేతిలో ఉన్న నగలను వారి చేతికి తీసుకొని ఆగంతుకుల చేతిలో ఉన్న నగలను ఈమె చేతిలో పెట్టి ఇచ్చి అక్కడ నుంచి జారుకున్నారు. కొంతసేపటికి మహిళ విషయాన్ని పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చింది.పోలీసులు వచ్చి పరిసర ప్రాంతాల్లో సిసి కెమెరాలు పరిశీలించారు. 40 గ్రాముల బొట్టు బొలుసు, ఐదు గ్రాములు తాళిబొట్టు,రెండు గ్రాములు లక్ష్మీకాసులు,రెండు గ్రాములు చొప్పున గుండ్లు,నోములు చోరీకి గురయ్యాయని చిన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లోకేష్ తెలిపారు.



# విద్యార్థినిపై మరో విద్యార్థి అగ్ని పరీక్ష

### పిఈటి శ్రీలత విద్యార్థిని పేరెంట్స్ పై తిట్లు పురాణం

### మీడియాపై దురుసుగా ప్రవర్తన.





వీ.కోట, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: చిత్తూరు జిల్లా,వీకోట మండలం, వీకోటలోని బాలుర ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో, అంబేద్కర్ నగర్ కు చెందిన గుణ కుమార్తె షర్మిక ఐదవ తరగతి చదువుతున్నది.నిన్న సాయంత్రం మూడన్నర గంటల సమయమున తోటి విద్యార్థులతో కలిసి వాష్ రూమ్ కి వెళ్లారు. వాష్ రూమ్ వద్ద ఐదవ తరగతికి చెందిన మరో ఇద్దరు ముగ్గురు కలిసి షర్మికను గట్టిగా పట్టుకొని కొట్టుతూ బలవంతంగా కుడిచేతిని పట్టుకుని అరచేతిలో కర్పూరం పెట్టి అగ్గి వెలిగించడంతో కర్పూరము వెలుగుతూ,అరిచేయి కాలిపోయింది. ఈ విషయమై గురువారం ఉదయం సుమారు 11 గంటల మధ్యన విద్యార్థిని తల్లిదండ్రులతో పాటు.. మీడియా పాఠశాలకు చేరుకున్నది. ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతుండగా,అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు అందరూ చూస్తుండగా పీఈటి మేడం శ్రీలత పేరెంట్స్ మధ్యలోకి చొరబడి బూతు పురాణాలు తిడుతూ,చెప్పలేని కోపంతో మీ అంత చూస్తాం,నేనెవరో తెలుసా? నాకు రాజకీయ నాయకులు అండగా ఉన్నారంటూ, బాధితురాలైన షర్మిక తల్లిదండ్రులతోపాటు,మీడియాపై దుమ్మెత్తి పోసి సభ్య సమాజం తలదించుకునేలా ప్రవర్తించారు. అదేవిధంగా విద్యార్థుల వద్ద పి ఈ టి మేడం శ్రీలత చేతులు కాళ్లు నొప్పిగా ఉన్నాయని ప్రతిరోజు మర్దన చేపించుకునేదని విద్యార్థులు తల్లిదండ్రులు పేర్కొన్నారు. మేడం శ్రీలత పై జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ కోరుతున్నాం.

### అంగరంగ వైభవంగా....

# ప్రారంభమైన యల్లమ్మ తల్లి పూజలు

కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 21: పులిచెర్ల మండలం పులిచర్లలో వెలసిన శ్రీ యల్లమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం ఎల్లమ్మ తల్లి పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో గణపతి పూజ ,గంగపూజ, వాస్తు పూజ ,యాగశాల, కలశపూజ కార్యక్రమాలు 11 మంది వేద పండితుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు.విశేష జనం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ దీక్షితులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులందరికీ స్వామి వారి కృప కటాక్షాలు, యల్లమ్మ తల్లి అనుగ్రహ ప్రతిష్టలు పొంది, భక్తుల కుటుంబ లకు అష్టైశ్వర్య ఆయురారోగ్యాలు పొందాలని ఆలయ ధర్మకర్త గోటూరి మురళీమోహన్ రెడ్డి అమ్మవారిని కోరారు. స్వామివారి కృపలో రాయల్ మోహన్ , ఎన్.ఎస్ రెడ్డి ప్రకాష్, నాద ముని రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రఘునాథరెడ్డి, సంపంగుల వెంకటరమణ, శ్రీధర్ గిరిధర్ రెడ్డి రామ్ కుమార్ రెడ్డి, రమేష్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, నాగయ్య ,గురుస్వామి,



రఘు, శివకుమార్, గోవింద్ రెడ్డి, లక్ష్మయ్య, దామోదర్ రెడ్డి, యల్లారెడ్డి, రామ్మూర్తి, రమణారెడ్డి, రామ్మూర్తి నాయుడు, కేశవ నాయుడు, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, చంద్రారెడ్డి ,ప్రభాకర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# "విద్యార్థులు భాష పట్ల మక్కువ పెంచుకోవాలి "

### "మన భాషను యాసను కాపాడుకోవడం మన బాధ్యత"

### "రుచి రాగాల పాలముద్ద తెలుగు" – "అమ్మ రూపమే తెలుగుభాష"

కల్లూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 21: " అమ్మ ప్రేమ కంటే మధురమైనది తెలుగు భాష "అని పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు శ్రీవాణి అన్నారు. కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వ హించా రు.విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ,విద్యార్థులతో కథలు చెప్పించడం మొదలగు పోటీలు, విద్యార్థులతో శ్రీకృష్ణ దేవరాయలువారి, అష్టదిగ్గజకవులవేషధారణలోనాటకీకరణ,భారతమాత వేషధారణ, తెలుగు భాష గొప్పతనాన్ని సమాజానికి తెలియజేసే విధంగా విద్యార్థులు వివిధ వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాల లోపాల్గొన్నారు.ఇలాంటి కార్యక్రమాల ద్వారావి ద్యార్థులలో భాషానైపుణ్యాలను, సృజనాత్మకత, భాష పట్ల మక్కువ, తెలుగుభాష యొక్క ప్రాముఖ్యత, భాషను ఉపయోగించడం మొదలగు విషయాలను




విద్యార్థుల్లో పెంపొందించవచ్చు.ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు దొరస్వామి, ఈశ్వ రయ్య, కాటయ్య, అమృతవల్లి ,కిరణ్మయి, సిద్దయ్య,ఉపాధ్యాయులు వనపర్తి వెంకట సిద్ధులు,వెంకటరమణారెడ్డి,రాజేంద్ర,వేణు గోపాల్,స్నేహమాలీని, పద్మవేణి,రహ్మద్ భాషా,సైదుల్లా,శివరాజు,చలపతి, మహ మ్మద్ రఫీతదితరులుపాల్గొన్నారు.

# 41 రకాల స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు అవకాశం

## ఐదేళ్ల తర్వాత మంజూరు కానున్న బీసీ కార్పొరేషన్ రుణాలు





వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: బీసీ కార్పొరేషన్ మళ్లీ కళకళలాడుతోంది. ఐదేళ్ల తర్వాత లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసేందుకు ఎన్డిఏ కూటమి టీడీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది.తొలుత బ్యాంకు లింకేజితో సబ్సిడీ రుణాలను వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపట్టారు.సబ్సిడీ రుణాల కోసం బీసీలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసు కునేందుకు అవకాశం కల్పించారు. మొత్తం 41రకాల స్వయం ఉపాధి యూనిట్లను స్థాపించుకునేందుకు దరఖాస్తులు స్వీకరిం చారు.వీటిలో పాటు రూ.8 లక్షల యూనిట్ విలువతో జనరిక్ మందుల దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు కూడా అవకాశం కల్పించారు.ఆన్లైన్ ద్వారా రుణాలు మంజూరు చేసేందుకు దరఖాస్తులను స్వీకరించారు.కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చాక తిరిగి కార్పొరేషన్లకుపూర్వ వైభవం వచ్చిందని కొందరు అభిప్రాయ పడ్డారు. వివిధ రకాలైన స్వయం ఉపాధి యూనిట్లు,బీ ఫార్మసీ చేసిన నిరుద్యోగుల కు జనరిక్ మందులు దుకాణాలను ఏర్పాటు చేసుకునేందుకు రుణాలు అందజేయనున్నారు.గొర్రెల పెంపకం,మినీ డెయిరీ,మోడ్రన్ పవర్ లాండ్రీ,ఆటో,టాటా ఏస్,వెదురు బుట్టల తయారీ,సెల్ ఫోన్ రిపేర్ వంటి 41రకాల స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయనున్నారు.ఇందులో వరదయ్యపాలెం మండలం నుండి 196 దరఖాస్తులు నమోదు చేసుకున్నారు.164 మంది దరఖాస్తు దారులు హాజరు కాగా, 32 మంది గైర్హాజరయ్యారని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు.ఎంపిక ప్రక్రియలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, వరదయ్యపాలెం రెండు శాఖలు,సప్తగిరి గ్రామీణ బ్యాంకు మూడు(చిన్నపాండూరు,సంతవేలూరు,వరదయ్యపాలెం)శాఖల మేనేజర్లు,అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర....


## విద్యార్థుల వీడ్కోలు



వరదయ్యపాలెం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21:శుక్రవారం వరదయ్యపాలెం హై స్కూల్ ప్లస్ నందు ఇంటర్మీడియట్ విద్యార్థుల ద్వితీయ సంవత్సరము వీడ్కోలు సమా వేశము సరస్వతి పూజా కార్యక్రమము నిర్వహించబడినది. శుక్రవారం ఉదయం ము సరస్వతి పూజ కార్యక్రమం పంతులు సమక్షంలో ఘనంగా నిర్వహించబడినది .విద్యార్థులందరూ కొవ్వొత్తులు వెలిగించి హాల్ టికెట్లు పెట్టి సరస్వతీ దేవినీ ప్రార్థించారు.విద్యార్థులు ఉపాధ్యాయుని ఉద్దే శించి గత రెండు సంవత్సరాలుగా ఉపా ధ్యాయుల యొక్క అనుభవాలను కూలం కషంగా వివరించారు.విద్యార్థులు తమ అనుభవాలను తమ స్నేహితులతో గత స్మృతులను నెమరు వేసుకున్నారు. చివర గా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చబడ్డాయి.మధ్యాహ్నము విద్యార్థులకు ఉపాధ్యాయులకు సహపంక్తి భోజనము నిర్వహించబడినది.ఈ కార్యక్రమమునకు ప్రధానోపాధ్యాయులు జి రమణయ్య, ఎస్ ఎంసి చైర్మన్ ఉదయ్ కుమార్ పిడి కుమార్, ఉపాధ్యాయులు శ్రీధర్ గోకుల కృష్ణ త్రిమూర్తి వాణి రవి పొట్టి బాబు మోహనా చారి విద్యార్థులుమొదలగువారు హాజరయ్యారు.

### పల్లె పండుగ పనులతో అభివృద్ధి చెందుతున్న....

## గోపాలరావు కాలనీ



వరదయ్యపాలెం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: వరదయ్యపాలెం మేజర్ పంచాయతీ లో గోపాలరావు కాలనీ లో పల్లె పండుగ పనులు శరవేగంగా జరిగింది. జాతీయ ఉపాధిహామీ నిధులు 20 లక్షలతో సిమెంట్ రోడ్ పనులు జరుగుతుంది.ఈ పనులను పన్నెం నిర్మల్ మరియు గ్యాస్ వెంకటేష్ ఆధ్వర్యంలో చేయించారు. దీనితో ఆ ప్రాంత ప్రజలు హర్షం తెలిపారు.జాతీయ ఉపాధి హామీ నిధులు కేటాయించిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ బొప్పన చంద్రబాబు,వార్డు మెంబెర్ లకు కూటమి నాయకులకు, అధికారులకు గోపాలరావు కాలనీ లోని పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

### అంతర్జాతీయ మాతృభాషా ....

## దినోత్సవం కార్యక్రమం



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్లస్ శ్రీకాళహస్తిలో కోలాహలంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పిల్లలు భువన విజయం నాటిక , రామాయణ ఇతి వృత్తం నృత్య రూపంలో,మూకీ ప్రదర్శన చేయడం జరిగింది. ఇదే కాకుండా వివిధ రకాల తెలుగు పద్యాలు, తెలుగు పాటలు పోటీలు నిర్వహించి బహుమతులు ఇవ్వడం జరిగింది. ఏ దేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని అన్న విధంగా తెలుగు యొక్క ఖ్యాతి పిల్లలు రాబోయే తరానికి గొప్పగా తీసుకుని వెళ్లాలని వక్తలు బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయసుధ, ఆంగ్ల అధ్యాపకులు గోపాలకృష్ణన్ పాఠశాల తెలుగు అధ్యాపకులు రవి బాబు,తెలుగు ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి,మంజుల,గీత, బుజ్జమ్మ,సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### జెఈఈ టాపర్ ను.....

## అభినందించిందిన ఎమ్మెల్

గంగావరం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: పలమనేరు నియోజకవర్గం గంగవరం మండలం జెఈఈ పరీక్షలో జిల్లా టాపర్ గా రాణించిన విద్యార్థినిని పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డి శుక్రవారం అభినందించారు. పట్టణానికి చెందిన సాయిబృందా స్థానిక మదర్ థెరిసా జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నెల మొదట్లో జరిగిన జేఈఈ మెయిన్ సెషన్స్ పరీక్షలో 98.01 శాతం మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా టాపర్ గా నిలిచింది. దీంతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆ విద్యార్థినీని ఎమ్మెల్యే తన కార్యాలయంలో అభినందించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యాన్ని సైతం ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిసా కళాశాలల అకడమిక్ అడ్వైజర్ రాజేంద్ర రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి మరియు సిబ్బంది ఉన్నారు.



### మహిళా సంక్షేమానికి పాటుపడుతున్న....
## నరేంద్రమోదీ ప్రభుత్వం బీజేపీ నేత డా. చంద్రప్ప.



శ్రీకాళహస్తి,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: శ్రీకాళహస్తి కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత డా. చంద్రప్ప పేర్కొన్నారు. బీజేపీలో క్రమశిక్షణతో, అంకితభావంతో పనిచేసే వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని.కుటుంబంలో ఎటువంటి రాజకీయ నేపథ్యం లేనప్పటికీ మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన రేఖా గుప్తాను ఢిల్లీ ముఖ్యమంత్రిని చేశారని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును పార్లమెంట్ లో అమోదించిందని ఆయన తెలిపారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఢిల్లీ ప్రభుత్వం అమలు చేస్తుందని డా. చంద్రప్ప వివరించారు. 2014 వ సంవత్సరంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా, సామజికంగా రాణిస్తున్నారని ఆయన స్పష్టం చేశారు.

### సారా స్థావరాలపై దాడులు చేసిన.....
## ఎస్ఐ వెంకటసుబ్బయ్య



వెదురుకుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: వెదురుకుప్పం మండలం నక్కలాంపల్లి పరిసర ప్రాంతాల్లోని సారా స్థావరాలపై వెదురుకుప్పం ఎస్ఐ వెంకటసుబ్బయ్య దాడులు నిర్వహించారు. ఈక్రమంలో 11 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 300 లీటర్ల ఊట ధ్వంసం చేశారు.

## పైప్ లైన్ డామేజ్ అవడంతో వెంటనే..... స్పందించిన స్థానిక సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి




వెదురు కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: వెదురు కుప్పం మండలం పెరుమాళ్ళపల్లి పంచాయతీ లో ఓవర్ హెడ్ ట్యాంక్ కు వెళ్లే పైప్ లైన్ డామేజ్ అవ్వడం జరిగింది వెంటనే స్థానిక సర్పంచ్ బండి శశి ఆనంద రెడ్డి ఆధ్వర్యంలో రిపేరు చేయించడం జరిగినది.

## నూతన పెన్షన్ దారులు వివరాలను.... పరిశీలించిన,ప్రత్యేకఅధికారిని లావణ్య,

**రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి**

కుప్పం, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: కుప్పం మండలం చెక్కునత్తం పంచాయతీ సచివాలయం లో నూతన పింఛన్లు వివరాలను పరిశీలించి, అర్హులు నుండి అర్జీలు స్వీకరించిన ప్రత్యేకఅధికారిని లావణ్య, రాష్ట్ర తెలుగు యువత కార్య నిర్వాహక కార్యదర్శి చెక్కునత్తం మణి,నాయకులు మునిరత్నం, కనకరాజు, బీరప్ప, తిమ్మప్ప, రాము, బాలు, పంచాయతీ కార్యదర్శి మురళి,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



### విద్యాలయాలకు, ప్రార్థనా మందిరాలకు.....
# బ్రాందీ షాపులను దూరంగా ఉంచండి
### పీలేరు తహసిల్దార్ గారికి ఎన్.ఎస్.యూ.ఐ వినతి



పీలేరు, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: అన్నమయ్య జిల్లా పీలేరు పట్టణం అజంతా మిట్ట మరియు నాలుగు రోడ్ల కూడలిలో (గాంధీ సర్కిల్) ఉన్న బ్రాందీ షాపులను విద్యాసంస్థలు మరియు ప్రార్థనా స్థలాలకు దూరంగా మార్చాలి అని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ ఆధ్వర్యంలో పీలేరు మండల తహసిల్దార్ గారికి వినతిపత్రం సమర్పించారు.(ఈ సందర్భంగా అమృత్ తేజ మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని అజంతా మిట్ట మరియు నాలుగు రోడ్ల కూడలిలో (గాంధీ సర్కిల్) ఉన్న బ్రాందీ షాపులు సమీపంలోని పాఠశాలలు, గుడులు, మసీదులు, మరియు చర్చిలకు అత్యంత సమీపంలో ఉన్నాయి. దీని వల్ల విద్యార్థులు, భక్తులు, మరియు స్థానిక ప్రజానికానికి తీవ్ర అసౌకర్యం కలుగుతోంది అని అన్నారు.పవిత్ర ప్రార్థనా స్థలాలు, విద్యాసంస్థలు, ఇవన్నీ మానవ విలువలను, సంస్కృతి, మరియు భవిష్యత్ తరాల అభివృద్ధిని పెంపొందించే చోట్లుగా ఉండాలి అని అన్నారు.అయితే, మద్యం షాపులు ఇలాంటి ప్రాంతాలకు సమీపంలో ఉండటం సమాజ శ్రేయస్సుకు విఘాతం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.అందువల్ల, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని, సమాజ హితాన్ని కాపాడే విధంగా, ఈ బ్రాందీ షాపులను ఇతర ప్రాంతాలకు మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నట్టు తెలిపారు.ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యతనిచ్చి వెంటనే స్పందించి, సరైన నిర్ణయం తీసుకుంటారని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.యూ.ఐ జిల్లా అధ్యక్షులు చీకటిపల్లి.సాయి సంపత్ కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి యూసఫ్, ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

### కుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో......
# ఘనంగా మాతృభాషా దినోత్సవం






కుప్పం,చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కుప్పం నందు శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోయే భాషల్లో తెలుగు భాష ఒకటేని తెలుగు భాషను రక్షించుకోవడానికి ఇంట బయట విద్యాలయాల్లో తప్పనిసరిగా తెలుగును అభ్యసనం చేయాలని విద్యార్థులకు హితవు పలికారు. అలాగే తెలుగు భాష క్రీస్తుపూర్వం నుండి నేటి వరకు అనంతమైన చరిత్రను కలిగిన భాషని పాశ్చాత్య దేశస్తులు సైతం తెలుగు భాష యొక్క గొప్పతనాన్ని కీర్తించిన వారని గుర్తు చేశారు. అలాగే ఐక్యుఏసీ కోఆర్డినేటర్ జాతీయ సేవా సమన్వయకర్త ఎల్ బి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూసమాజ హితం కోసం జాతీయ సమైక్యత కోసం వ్యక్తి తన మనవడును కాపాడుకోవడం కోసం మాతృభాషను విధిగా అభ్యసనం చేయాలని భావితరాలకు భాషను అందించాల్సిన బాధ్యత ఈనాటి విద్యార్థి లోకం దేనని కొనియాడారు. అలాగే తెలుగు అధ్యాపకులు డా గొర్రెల నాగరాజు మాట్లాడుతూ భాషల పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి , సాంస్కృతిక పరిరక్షణ కోసం ఐక్యరాజ్యసమితి చేస్తున్న కృషి ఫలితంగా నేడు అనగా ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకోవడానికి గల కారణాన్ని విద్యార్థి లోకానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి ఈశ్వరాచారి, రవికుమార్, డా. అపర్ణాదేవి తదితర అధ్యాపక అధ్యాపకేత్ర బృందం విద్యార్థిని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

### ఎన్.ఎస్.ఎస్ .ఆధ్వర్యంలో ....
# డిజాస్టర్ మేనేజ్ మెంటు అవగాహన సిబిరం.



గుడిపల్లి, చిత్తూరు ఎక్స్ ప్రెస్, ఫిబ్రవరి 21: కుప్పం నియోజకవర్గం గుడిపల్లి మండలం లోని ద్రావిడ విశ్వ విద్యాలయం లో ఎన్.ఎస్.ఎస్. విభాగం మరియు సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో అనేక రకాల విపత్తుల నుండి మనల్ని మనము రక్షించుకొని ఇతరులను రక్షించుటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, చేయాల్సిన సహాయాన్ని ఏవిధంగా చేయాలో విద్యార్థులకు అవగాహన కలిగించారు. ఉపాధ్యక్షులు ఆచార్య ఎమ్. దొరస్వామి మాట్లాడుతూ మనల్ని మనం రక్షించుకోడానికి , పలురకాల విపత్తులలో చిక్కుకున్న వారిని రక్షించాల్సిన బాధ్యత యువతపై వుందని,కాబట్టి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతి నుండి మరియు మానవులనుండి వచ్చే ప్రమాదాలనుండి మనల్ని మనమే రక్షించుకోవాలంటే కొన్ని నైపుణ్యాలు తెలుసుకోవాలని,ఈ కార్యక్రమం విద్యా ర్థులందరు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య కె.శ్యామల మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు విపత్తులలో చిక్కుకున్న వారిని రక్షించాల్సిన అవసర మెంతైనా వుందని తెలియజేశారు. ఈ సందర్భంగా విజయవాడ వరదబాధితుల కు ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు చేసిన సేవలను కొనియాడారు. ఎన్.ఎస్.ఎస్. కో ఆర్డినేటర్ ఆచార్య ఆర్. యశోద సత్యసాయిసేవా సంస్థ చేస్తున్న డిజాస్టర్ మేనేజ్ మెంటు శిక్షణా కార్యక్ర మాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి ట్రైనర్సు ఒరిస్సా,విశాఖపట్నం, హైదరాబాదు, విజయవాడ,తిరుపతి సత్యసాయి సేవా సంస్థ నుండి వచ్చిన ఆరు మంది విపత్తు ల లో చిక్కుకున్న వారిని రక్షించాల్సిన పద్ధతులను అనేక ఉపకరణాలను ఉపయోగించి చూపారు. విద్యార్థులు స్వయంగా నేర్చుకునేలా చేసి చూపిం చారు. విద్యార్థులకు డిజాస్టర్ మేనేజ్ మెంటు పై ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రామింగు ఆఫీసర్సు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామింగు ఆఫీసర్సు డా. తోట వెంకటస్వామి,డా.ఎమ్. హరికృష్ణ, డా.బి.శ్రీనివాస్,డా. టి. శోభారాణి, డా.జి. శైలమ్మ , ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కోర్సులకు సంబంధించిన విద్యార్థిని,విద్యార్థులు జాతీయ విపత్తుల కార్యక్రమంలో పాల్గొన్నారు. జాతీయ విపత్తుల నుండి పరిరక్షించుకునే అనేక కృత్యాలు నేర్చుకొనుటలో భాగస్వా ములయ్యారు. ఉపాధ్యక్షులు ఆచార్య ఎమ్.దొరస్వామి,రిజిస్ట్రార్ ఆచార్య వి. కిరణ్ కుమార్,అకడమిక్ డీన్ ఆచార్య కె. శ్యామల ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని,విద్యార్థులను, అభినందించారు.

# ఇక ఫుల్ టైమ్ పాలిటిక్సేనా..?

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి రాజకీయాలకే పరిమితమయ్యేటట్లే కనిపిస్తుంది. ఆయన ఇకపై సినిమాలు చేయడానికి సిద్ధంగా లేరన్న వార్తలు ఆయన ఫ్యాన్స్ ను ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. ఇప్పటి వరకూ ఒప్పందం చేసుకున్న సినిమాలను ఎలాగోలా పూర్తి చేసి పూర్తి స్థాయి రాజకీయాలు చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత ఆరోగ్యం కూడా ఇబ్బంది పెడుతుంది. సరైన సమయంలో తిండి లేకపోవడం, నిద్రలేమి వంటి వాటితో తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు. కానీ కసితో రాజకీయాలకు వచ్చిన పవన్ కల్యాణ్ దానినే ప్రధానంగా ఎంచుకోవవాలని నిర్ణయించుకున్నారు. రెండు పడవల మీద కాలు మోపేకంటే ఒకదానిలో ఉండి లక్ష్యాన్ని చేరడం కోసం ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సన్నిహితులు చెబుతున్నారు. ఎందుకంటే ఇటీవల ఒక దర్శకుడు పవన్ కల్యాణ్ తో సమావేశమై కథ వినిపించడానికి సిద్ధమవ్వగా అందుకు పవన్ సున్నితంగా తిరస్కరించినట్లు టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. తాను ఇకపై సినిమాలు చేయదలచుకోలేదని, ప్రస్తుతం తాను ఉప ముఖ్యమంత్రిగా ఉన్నానని, ప్రజల సమస్యలను పరిష్కరించడానికే ఎక్కువ సమయం వెచ్చించాల్సి ఉన్నందున సినిమాలకు ఇకపై సంతకం చేయనని చెప్పినట్లు తెలిసింది. పవన్ సన్నిహితుడు తివిక్రమ్ కూడా ఈ విషయాన్ని తన సన్నిహితుల వద్ద చెప్పడంతో ఇందులో నిజముందని అనుకోవాల్సి ఉంది. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఏపీ ప్రజలు తనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, తాను రాజకీయాల్లో ఎదిగి తిరిగి ఓడి వెనుదిరగడానికి పవన్ ఇష్టపడటం లేదు. జనసేన పార్టీ పెట్టినప్పుడే తాను ఇరవై ఐదేళ్లు రాజకీయాలు చేయడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు పవన్ కల్యాణ్. అనుకున్నట్లుగానే పదో ఏడాది ఆయన ఉప ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. అయితే తాను అనుకున్న పనులన్నీ పూర్తి చేయలేకపోతున్నారు. ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన హామీలతో పాటు కొన్ని కీలక, సున్నిత అంశాలను కూడా పరిష్కరించడానికి ఆయన సతమతమవుతున్నారు.

## నెత్తురోడుతున్న రహదారులు
### రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి.... విలువైన ప్రాణాలను కాపాడండి.. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు



చిత్తూరు,చిత్తూరు ఎక్స్ ప్రెస్,ఫిబ్రవరి 21: చిత్తూరు పార్లమెంటులో ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలతో రహదారులు నెత్తురోడుతున్నాయని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు ఓ ప్రకటనలో ఆవేధన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల పై చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ శుక్రవారం ఢిల్లీలో స్పందించారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయన్నాని ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఇటీవల ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలు,మాసోత్సవాలను నిర్వహించి, యువతకు అవగాహన కల్పించిందని గుర్తుచేసిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు.., ఐనా ఈ వరుస యాక్సిడెంట్స్ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయని ఆయన అసహనం వ్యక్తం చేశారు. మానవ తప్పిదాల వల్లే చోటు చేసుకుంటున్న ఈ రోడ్డు ప్రమాదాల వల్ల విలువైన ప్రాణాలు గాల్లో కలిసిపో తున్నాయనీ,...ఈ క్రమంలో వీటినివారణ కు సంబంధిత అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని సూచించారు. జరిగిన రోడ్డు భద్రతా వారోత్సవాలు,మాసోత్సవాల కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్న తాను... రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే నష్టాలను యువతీయువకులు వివరించినట్లు పేర్కొన్నారు. అదే సమయంలో అధికారుల కు తమ కర్తవ్యాన్ని గుర్తు చేసినట్లు వివరిం చారు. మరీ ముఖ్యంగా యువత తమ కుటుంబాన్ని గుర్తుపెట్టుకుని వాహనాలను నడిపి.., సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవా లని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు సూచించారు.?

## 55 మంది డాక్టర్ల తొలగింపు

విజయవాడ : ఏపీలో ఏకంగా 55 మంది ప్రభుత్వ వైద్యులను విధుల నుండి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 78 మందిలో 23 మంది ప్రభుత్వానికి సరియైన సమాధానం ఇవ్వగా, మిగిలిన వారిని విధుల నుండి తొలగించారు. ఒకేసారి భారీ సంఖ్యలో వైద్యులను తొలగించడం వెనుక పెద్ద కారణమే ఉంది. అదేమిటో తెలుసుకుందాం.కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా, సెలవు పెట్టకుండా కొందరు వైద్యులు విధులకు డుమ్మా కొడుతూ.. వేతనాలు పొందుతున్నట్లు శ్రీనివాస్ గౌడ్ ఏకంగా లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో ప్రభుత్వం పలు మార్లు వైద్యులకు షోకాజ్ నోటీసులు కూడా జారీ చేసింది. మొత్తం 78 మంది వైద్యులు విధులకు గైర్హాజరు అవుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో కొందరు ప్రొఫెసర్ లు కాగా, మరికొందరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కావడం విశేషం. రోగులకు సేవలు అందించాల్సిన వీరు, విధులకు గైర్హాజరు కావడంపై లోకాయుక్తతో పాటు ప్రభుత్వం సీరియస్ గా పరిగణించింది.దీనితో 78 మంది ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ నోటీసులకు 23 మంది స్పందించి సరియైన సమాధానం ఇచ్చినట్లు సమాచారం. మిగిలిన వారు సమాధానం ఇవ్వక పోవడంతో మరోమారు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఆ నోటీసులకు కూడా ఎటువంటి సమాధానం ఇవ్వక పోవడంతో, చేసేదేమి లేక ప్రభుత్వం తగు చర్యలు తీసుకున్నట్లు సమాచారం. షోకాజ్ నోటీసులకు స్పందించని 55 మందిని విధుల నుండి ప్రభుత్వం తొలగించింది. ఈ మేరకు 55 మందిని తొలగించినట్లు లోకాయుక్తకు ప్రభుత్వం సమాచారం అందజేసింది.కాగా ఖాళీగా ఉన్న పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసే చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం. సాధ్యమైనంత త్వరగా భర్తీ చేసి, రోగులకు ఇబ్బంది కలగకుండా చూసేలా ప్రభుత్వం కృషి చేయనుంది. మొత్తం మీద 2023లో అందిన ఫిర్యాదు మేరకు లోకాయుక్త తీసుకున్న చొరవతో విధులకు గైర్హాజరు అవుతున్న 55 మందిని విధుల నుండి తొలగించడం ఇప్పుడు సంచలనంగా మారింది. ఎట్టకేలకు రెండేళ్ల తర్వాత చర్యలు తీసుకున్నారని, ఇలాంటి వైద్యులపై ప్రభుత్వం ఓ కన్నేసి ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.వైద్యో నారాయణో హరి అంటారు. వైద్యుడు దేవుడితో సమానంగా భావించే సమాజంలో ఉంటూ.. విధుల పట్ల అశ్రద్ధ వహించే వైద్యులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ఇప్పుడు వినిపిస్తోంది. అసలే రానున్నది ఎండా కాలం. వడదెబ్బ సోకే అవకాశాలు ఎక్కువ. అలాగే పలు రకాల వ్యాధుల భయం కూడా ప్రజల్లో ఉన్న పరిస్థితుల్లో వైద్య ఆరోగ్య శాఖ వైద్యశాలల తీరుతెన్నులపై ఓ నిఘా ఉంచాలని, అర్హత లేకుండా వైద్యం చేసే వ్యక్తులను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## సిక్కోలు వైసీపీలో గ్రూపుల గోల

శ్రీకాకుళం :ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైసీపీలో గ్రూపుల గోల చల్లారడం లేదు. ఎన్నికలకు ముందు కూడా పార్టీలో గ్రూపు పాలిటిక్స్‌కు చెక్ పెట్టకపోవడంతో తీవ్ర నష్టం జరిగిందని అంటున్నారు క్యాడర్, లీడర్లు. వైసీపీ ముఖ్యనేతల దగ్గరే తమ ధిక్కార స్వరం వినిపిస్తున్నారట. ఇప్పుడైనా నియోజకవర్గ ఇంచార్జ్‌లను మార్చాలని లేకపోతే మరోసారి నష్టపోవాల్సి వస్తుందని పార్టీ పెద్దలకు తెగేసి చెప్తున్నారట క్యాడర్.అయితే ఇప్పటికే వైసీపీ అధిష్టానం కొంత నష్టనివారణ చర్యలు మొదలుపెట్టింది. ఆమదాలవలస నియోజకవర్గ ఇంచార్జ్ తమ్మినేని సీతారాం, టెక్కలి ఇంచార్జ్ దువ్వాడ శ్రీనివాస్‌ను తప్పించింది. తమ్మినేనికి పార్లమెంటరీ కోఆర్డినేటర్ బాధ్యతలు అప్పగించారు. ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన పేరాడ తిలక్‌కు టెక్కలి నియోజకవర్గ బాధ్యతలు ఇచ్చింది అధిష్టానం.ఇక మిగతా నియోజకవర్గాల్లో కూడా ఇంచార్జులను మార్చాలని పట్టుబడుతున్నారట క్యాడర్. ముఖ్యంగా ఎచ్చెర్ల నియోజకవర్గ ఇంచార్జ్ గొర్లే కిరణ్ కుమార్, రాజాం ఇంచార్జ్‌గా ఉన్న డాక్టర్ తలే రాజేష్, పాతపట్నం ఇంచార్జ్ రెడ్డి శాంతి, ఇచ్ఛాపురం ఇంచార్జ్ పిరియా విజయలను మార్చాలని పట్టుబడుతున్నారట వైసీపీ కార్యకర్తలు, లీడర్లు. ఎలక్షన్ తర్వాత రాజాం నియోజకవర్గ పరిస్దితి మరింత దయనీయంగా తయారైందంట. గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన డాక్టర్ తలేరాజేశ్ ఇప్పుడు పేరుకే ఇంచార్జ్‌గా ఉన్నారట.

OWNER AND PUBLISHED BY DAMA VIJAYAKUMAR, PRINTED AT VIJAY PUBLISHERS AND PRINTERS
D.No. 1-176, ANJUR Village & Post, K.V.B.PURAM Mandal, PIN:517643, Thirupati District A.P. Mobile: 9440352036